సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

గురువారం, 20, మార్చి, 2025

I



అంగన్‌వాడీల్లోనూ 'హాఫ్ డే'

ఎండల నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాలను ఒకపూటే నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించగా ఈనెల 15 నుంచి అమల్లోకి వచ్చింది. IIలో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (గురువారం సా॥) 6.26

సహర్ (శుక్రవారం ఉ॥) 4.56

వాతావరణం

గరిష్టం / కనిష్టం 38°/ 21°

జిల్లాలో గురువారం ఉష్ణోగ్రత అధికంగానే నమోదవుతుంది. ఉదయం మొదలయ్యే ఎండ మధ్యాహ్నానికి తీవ్రమవుతుంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భ గుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితరపూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మ వారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నేడు, రేపు కార్పొరేట్ మెడికల్ బోర్డు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సింగరేణి ప్రధానాస్పత్రిలో గురు, శుక్రవారాల్లో కార్పొరేట్ మెడికల్ బోర్డ్ నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. నేడు కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించనుండగా మెడికల్ రిపోర్ట్‌ల ఆధారంగా పని చేయలేని వారిని శుక్రవారం అన్‌ఫిట్ చేస్తామని తెలిపారు.

పీహెచ్‌సీలో డీఎంహెచ్‌ఓ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న భాస్కర్‌నాయక్

కొత్తగూడెంఅర్బన్ : కొత్తగూడెం పట్టణ పరిధి సఫాయిబస్తీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి భాస్కర్‌నాయక్ బుధవారం తనిఖీ చేశారు. మందుల స్టాక్ రికార్డులు, సిబ్బంది హాజరు పట్టికలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కుష్ఠు వ్యాధి నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, ఇందుకోసం విస్తృత ప్రచారం నిర్వహించాలని పారా మెడికల్ సిబ్బందికి సూచించారు.

'వాటర్ స్పోర్ట్స్ ఈవెంట్'లో నేటి నుంచి శిక్షణ

కొత్తగూడెంటౌన్: అశ్వాపురం మండలంలోని తుమ్మలచెరువు వద్ద 'రోయింగ్ వాటర్ స్పోర్ట్స్ ఈవెంట్'లో గురువారం నుంచి ఈనెల 26వ తేదీ వరకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు డీవైఎస్ఓ పరంధామరెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అంతర్జాతీయ రోయింగ్ క్రీడాకారుడు యలమంచి కిరణ్ శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని, లేదంటే నేరుగా తుమ్మలచెరువు వద్దకు వెళ్లి సంప్రదించవచ్చని వివరించారు. వివరాలకు తమ కార్యాలయ సిబ్బంది లక్ష్మయ్య(99661 25087), కోచ్ యలమంచి కిరణ్ (94945 97083)ను సంప్రదించాలని సూచించారు.

27న కొత్తగూడెం 'బార్' ఎన్నికలు

నామినేషన్లకు నేడు తుది గడువు



మాట్లాడుతున్న గణేష్‌బాబు

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం బార్ అసోసియేషన్ ఎన్నిక ఈనెల 27న నిర్వహించనున్నట్లు సీఈఓ పలివేల గణేష్‌బాబు తెలిపారు. బరిలో నిలిచే అభ్యర్థులు గురువారం వరకు నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉందని చెప్పారు. స్థానిక కోర్టులో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, జనరల్ సెక్రటరీ, మహిళా రిప్రజెంటేటివ్, లైబ్రరీ సెక్రటరీ, ట్రెజరర్, స్పోర్ట్స్, కల్చరల్ సెక్రటరీ పదవులకు ఎన్నికలు జరగనున్నాయని వివరించారు. ఈనెల 17 నుంచి నామినేషన్లు స్వీకరిస్తుండగా బుధవారం నాటికి 34 మంది దాఖలు చేశారని తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణకు 22 వరకు గడువు ఉంటుందని, అదేరోజు సాయంత్రం 4 గంటలకు బరిలో ఉండేవారి పేర్లు ప్రకటిస్తామని చెప్పారు. సమావేశంలో సహాయ ఎన్నికల అధికారులు ఎర్రపాటి కృష్ణ, పాల రాజశేఖర్ పాల్గొన్నారు.

జిల్లాకు ఊరట..

కొత్తగూడెం కార్పొరేషన్‌కు బడ్జెట్‌లో నిధులు

- సీతారామ ప్రాజెక్టుకూ భారీగానే కేటాయింపు
- పల్లెలు, గిరిజన గూడేలకు రోడ్డు సౌకర్యం
- జిల్లాలో టూరిజం, వ్యవసాయ అనుబంధ రంగాలకు ఊతం
- 'భద్రాద్రి', ఇంజనీరింగ్ కాలేజీకి మాత్రం మొండిచేయే..





సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: త్వరలో ఏర్పాటుకాబోయే కొత్తగూడెం కార్పొరేషన్‌కు ప్రస్తుత బడ్జెట్‌లో చోటు దక్కింది. కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీలతో పాటు సుజాతనగర్ మండలంలోని ఏడు గ్రామపంచాయతీలను కలిపి కొత్తగూడెం కార్పొరేషన్ ఏర్పాటుకు సంబంధించిన బిల్లును మంగళవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టగా.. ఈ బడ్జెట్ సమావేశాలు పూర్తయ్యేలోగా ఆమోదం రావడంతో పాటు గవర్నర్ సంతకం చేసి గెజిట్ వచ్చే అవకాశం ఉందని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ధీమా వ్యక్తం చేస్తున్నారు. దీనికి బలం చేకూర్చేలా కొత్తగూడెం - పాల్వంచ కార్పొరేషన్‌కు నగరాభివృద్ధి పద్దులో ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నట్టు బడ్జెట్‌లో పలుమార్లు పేర్కొన్నారు. ఇటీవల కార్పొరేషన్లుగా అప్‌గ్రేడ్ అయిన మంచిర్యాల, మహబూబ్‌నగర్‌తో పాటు కొత్తగూడేనికి వివిధ పద్దుల కింద రమారమీ రూ.1,000 కోట్ల నిధులు కేటాయించారు. దీంతో కొత్తగూడెం కార్పొరేషన్‌కు పెద్దపీట వేసినట్టయింది. కాగా, ఓఎన్‌జీసీ, సింగరేణి భాగస్వామ్యంలో మణుగూరు మండలం పగిడేరు వద్ద జియో థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మిస్తామని భట్టి వెల్లడించారు.

సాగునీటి రంగానికీ ఊతం..

2025 - 26 రాష్ట్ర బడ్జెట్‌లో సీతారామ ప్రాజెక్టుకు రెండు పద్దుల కింద వరుసగా రూ.643 కోట్లు, రూ.56 కోట్లు కేటాయించారు. తొమ్మిదేళ్ల క్రితం ఈ ప్రాజెక్టు పనులు చేపట్టి రూ.10వేల కోట్లకు పైగా ఖర్చు చేసినా ఇప్పటికీ ఒక్క ఎకరాకు నీరు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. ఈ నెల ఆరంభంలో తొలిసారిగా గోదావరి నీళ్లు ఎన్నెస్పీ కెనాల్‌కు చేరుకోవడం సానుకూల అంశం. ఇదే తీరుగా ప్రాజెక్టు పనులు ముందుకు సాగి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ప్రాజెక్టులకు నీరు మళ్లించేందుకు ప్రస్తుత కేటాయింపులు దోహదపడనున్నాయి. ఇక మధ్య తరహా ప్రాజెక్టుల్లో పెదవాగుకు రూ.46 కోట్లు, తాలిపేరుకు రూ.7.30 కోట్లు కేటాయించడం గమనార్హం.

రైస్ మిల్లులు రాబోతున్నాయి..

జిల్లాలో రైస్ మిల్లుల కొరత తీవ్రంగా ఉంది. ఇక్కడ పండించిన ధాన్యాన్ని మిల్లింగ్ కోసం ఇతర జిల్లాలకు తరలించాల్సి వస్తోంది. ప్రస్తుత బడ్జెట్‌లో ప్రతీ మండలంలో మహిళా రైస్ మిల్లులు ఏర్పాటు చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారు. ప్రస్తుతం ఐకేపీల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఈ రైస్ మిల్లులకు తరలిస్తామని, ఇక్కడి నుంచే ఎఫ్‌సీఐకి ఆ ధాన్యాన్ని విక్రయిస్తామని తెలిపారు. మరోవైపు ప్రజా రవాణాతో పాటు సరుకు రవాణా కోసం ఆర్టీసీ బస్సులను మండల సమాఖ్యలకు ఇవ్వనున్నారు. ఇప్పటికే జిల్లాలోని డిపోలకు బస్సులు చేరుకున్నాయి. దీనికి తోడు మండలాల్లో మినీ గోడౌన్లు నిర్మిస్తామన్నారు. ఈ గోడౌన్లు, వాటి ప్రాంగణాలు సైతం రైతులకు ఉపయోగకరం కానున్నాయి.

టూరిజానికి ఊతం..

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన టూరిజం పాలసీలో జిల్లా చోటు దక్కించుకుంది. కిన్నెరసాని దగ్గర అంతర్జాతీయ స్థాయిలో ఎకో టూరిజం అభివృద్ధి చేసేందుకు కన్సల్టెంట్‌ను నియమిస్తామని డిప్యూటీ సీఎం ఇప్పటికే ప్రకటించారు. ప్రస్తుత బడ్జెట్ ద్వారా జిల్లాలో పర్యాటక రంగానికి రూ.775 కోట్లు ప్రకటించడంతో టూరిజం పరంగా సౌకర్యాలు మెరుగుపడే అవకాశం ఉంది.

పల్లెలకు బాటలు..

జిల్లాలో ప్రతీ పంచాయతీకి బీటీ రోడ్డు సౌకర్యం కల్పించాలని ఈ బడ్జెట్‌లో నిర్ణయించారు. అడవుల్లోనే నివాసం ఉండే పీవీటీజీ ఆవాసాలకు సైతం సీసీ రోడ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. జిల్లాలోని దమ్మపేట మండలంలో కాలిబాట ఉన్న పూసుగూడెం పరిసర గ్రామాలకు పక్కా రోడ్డు రానుంది. అలాగే రాష్ట్రంలోని మూడు ఐటీడీఏల పరిధిలోని మండలాల్లో రోడ్ల నిర్మాణాలకు రూ.450 కోట్లు కేటాయించగా.. ఈ మూడు ఐటీడీఏల్లో భద్రాచలమే పెద్దదిగా ఉంది.

మావోయిస్టు ప్రభావిత నిధులు..

మావోయిస్టు ప్రభావిత ప్రాంతంగా ఉన్న ఈ జిల్లాకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 20 కోట్లు కేటాయించింది. దీనికి అదనంగా కేంద్ర పద్దు కింద రూ.82 కోట్ల కేటాయింపులు చూపారు. ఇందులో లొంగిపోయిన మావోయిస్టులకు రూ.20కోట్లు ఉండగా మిగిలినవి ఇన్‌ఫర్మేషన్, సెక్యూరిటీ, ఎస్టాబ్లిష్‌మెంట్ తదితర అవసరాల కోసం వెచ్చించనున్నారు.

భద్రగిరికి నిరాశే

రాష్ట్రంలో ప్రముఖ ఆలయాలైన యాదగిరిగుట్టకు రూ.200 కోట్లు, వేములవాడ టెంపుల్ అథారిటీకి రూ.100 కోట్లు ఈ బడ్జెట్‌లో కేటాయించారు. అయితే భద్రాచలం క్షేత్రానికి మాత్రం మళ్లీ నిరాశే ఎదురైంది. గత పదకొండేళ్లుగా ప్రతీ బడ్జెట్‌లో భద్రాచలం ఆలయానికి ప్రత్యేక నిధుల కేటాయింపు అనేది ఎండమావిగానే నిలుస్తోంది. సాంకేతిక విద్య విషయానికి వస్తే కొత్తగూడెంలో ఉన్న ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీలో కొత్త భవనాలు, ల్యాబ్‌లు, పరికరాల కోసం రూ.75 కోట్లు కేటాయించాలని 2023లో ప్రతిపాదనలు పంపినా ఇప్పటికీ మోక్షం రాలేదు. అయితే జేఎన్‌టీయూ, పాలేరుకు రూ.50 కోట్ల కేటాయింపు ఊరటనిచ్చే అంశంగా మిగిలింది.

భక్తులకు చల్లదనం కల్పిస్తాం

- శ్రీరామ నవమికి భద్రాచలంలో అన్ని ఏర్పాట్లు
- సరిపడా వసతులు, తలంబ్రాలు అందిస్తాం
- కలెక్టర్ జితేష్ వి పాటిల్ వెల్లడి

భద్రాచలం : ఏప్రిల్‌లో ఎండలు అధికంగా ఉండనున్న నేపథ్యంలో ఈ ఏడాది శ్రీరామనవమికి వచ్చే భక్తులకు చల్లదనం కోసం ఈ ఏడాది ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. నవమి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. మిథిలా స్టేడియంలో పునాది, స్వాగత ద్వారాలతో పాటు ఇతర పనులపై అధికారులతో చర్చించారు. అనంతరం మాట్లాడుతూ.. వేసవికాలంలో భక్తులకు ఉపశమనం కలిగించేందుకు తొలిసారి ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో మిస్ట్ ఫాగింగ్(పొగమంచు కురిసినట్టుగా) ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. భక్తులందరికీ సరిపడా ముత్యాల తలంబ్రాలు, ప్రసాదాలను దేవస్థానం ఆధ్వర్యంలో తయారుచేస్తున్నామని, కల్యాణాన్ని వీక్షించిన భక్తులు వాటిని స్వీకరించాలని సూచించారు. అందరికీ సరిపడా వసతులను కల్పించాలని, వీఐపీలతో పాటు సామాన్య భక్తులు కూడా ప్రశాంతంగా కల్యాణాన్ని వీక్షించేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

మొబైల్‌యాప్‌పై అభినందన..

కలెక్టర్ పాటిల్ తొలుత రామాలయానికి చేరుకోగా ఈఓ రమాదేవి, అర్చకులు ఆలయ సంప్రదాయాలతో స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో ప్రత్యేక పూజల అనంతరం శ్రీ లక్ష్మీతాయారమ్మవారి ఉపాలయంలో పండితులు వేదాశీర్వచనం చేశారు. ఈఓ స్వామివారి జ్ఞాపిక, ప్రసాదం అందజేశారు. భక్తుల కోసం రూపొందించిన మొబైల్ యాప్ గురించి, అందులో పొందుపర్చిన సేవలు, సందర్శనీయ స్థలాలు, వసతుల గురించి వివరించారు. దీన్ని పరిశీలించిన కలెక్టర్ అధికారులను అభినందించారు.



దివ్యాంగ విద్యార్థులతో కలెక్టర్, డీఈఓ, అధికారులు

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ఎదగాలి

కొత్తగూడెంఅర్బన్: దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ఎదగాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. జిల్లా విద్యాశాఖ, అలింకో సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం కొత్తగూడెంలో దివ్యాంగ విద్యార్థులకు ఉచిత పరికరాలు, ఉపకరణాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించే సదుపాయాలను దివ్యాంగులు వినియోగించుకునేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని అన్నారు. దివ్యాంగులకు దృఢ సంకల్పం ఎక్కువగా ఉంటుందని, తనతో కలిసి చదువుకున్న మానసి జోషి ప్రమాదంలో కాళ్లు కోల్పోయినా దృఢ నిశ్చయంతో ఆడి పారా ఒలింపిక్‌లో గోల్డ్ మెడల్ సాధించిందని గుర్తు చేసుకున్నారు. దివ్యాంగ విద్యార్థుల ఎదుగుదలకు తోడ్పాటునందిస్తున్న స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లను అభినందించారు.

పెద్దమ్మగుడి పాలకమండలికి మరో జాబితా!

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని పెద్దమ్మతల్లి ఆలయ పాలకవర్గ నియామకంలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఈనెల 6వ తేదీన పాలక మండలి జాబితాకు సంబంధించిన జీఓ విడుదల కాగా, అది వివాదాస్పదం కావడంతో దాన్ని రద్దు చేసి తాజాగా బుధవారం మరో జాబితాను ప్రకటించారు. దీంతో మంత్రి పొంగులేటి వర్గం నేతలు పంతం నెగ్గించుకున్నారనే చర్చ సాగుతోంది. ఆలయ పాలక వర్గానికి సంబంధించి 14 మందితో కూడిన జాబితాను ఈనెల 6న దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ విడుదల చేసినా.. ఈ కమిటీపై కొందరు అభ్యంతరం వ్యక్తం చేస్తూ రెవెన్యూ, దేవాదాయ శాఖ మంత్రులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ జాబితా బయటకు పొక్కకుండా అధికారులు గోప్యంగా ఉంచారు. ఆ జాబితాలో కొన్ని పేర్లు మార్పులు, చేర్పులు చేస్తూ తాజాగా 13 మందితో మరో సర్క్యులర్ విడుదల చేశారు. మలి జాబితాలో కందుకూరి రాము, భూక్యా గిరిప్రసాద్, కోరం స్వర్ణలత, బాలినేని నాగేశ్వరరావు, పెండ్లి రామయ్య, చందుపట్ల రమ్య, ధర్మరాజుల నాగేశ్వరరావు, చీకటి కార్తీక్, చేవుగాని పాపారావు, చెరుకూరి శేఖర్‌బాబు, దుగ్గిరాల సుధాకర్, శనిగారపు శ్రీనివాసరావు, అడుసుమల్లి సాయిబాబా పేర్లు ఉన్నాయని తెలిసింది. కాగా, ఈ విషయమై దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ వీరస్వామిని వివరణ కోరగా తమకు ఎండోమెంట్ కమిషనర్ నుంచి బుధవారం నాటికి ఎలాంటి ఉత్తర్వులు రాలేదని తెలిపారు. కమిషనర్ నుంచి ప్రొసీడింగ్స్ వస్తే కమిటీ వివరాలు తెలియజేస్తామని చెప్పారు.

విద్యుత్ చార్జీల పెంపు లేదు..

బహిరంగ విచారణలో ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్‌లో విద్యుత్ చార్జీల పెంపుపై స్పష్టత వచ్చింది. హనుమకొండలో బుధవారం 2025–2026 ఆర్థిక సంవత్సరానికి సవరణ చేసిన రిటైల్ సప్లయి వ్యాపారానికి సమగ్ర ఆదాయ ఆవశ్యకత, ధరలు, క్రాస్ సబ్సిడీ సర్‌చార్జీల ప్రతిపాదనలపై బహిరంగ విచారణ జరిగింది. తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ జస్టిస్ దేవరాజు నాగార్జున్ అధ్యక్షతన జరిగిన ఈ విచారణలో విద్యుత్ టారిఫ్‌ల ప్రతిపాదనలను టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. 2025–2026 ఆర్థిక సంవత్సరానికి టారిఫ్ పెంపుదలపై ఎలాంటి ప్రతిపాదనలూ చేయలేదని, ప్రస్తుత ధరల్లో ఎలాంటి మార్పూ ఉండదని స్పష్టం చేశారు. గ్రీన్ ఎనర్జీని ఎంచుకునే ఎల్‌టీ, హెచ్‌టీ వినియోగదారులకు సాధారణ టారిఫ్ కంటే యూనిట్‌కు రూ.0.66 గ్రీన్ టారిఫ్ విధింపు కొనసాగుతుందని తెలిపారు. ఓపెన్ యాక్సెస్‌లో విద్యుత్ కొనుగోలు చేసి ఎన్పీడీసీఎల్ విద్యుత్ లైన్లు వినియోగించుకున్న వినియోగదారులకు ఎనర్జీ చార్జీల్లో 10 శాతం చొప్పున స్టాండ్ బై చార్జీల విధింపు కొనసాగిస్తున్నామని వెల్లడించారు. టీజీ ఎన్పీడీసీఎల్ నిర్వహణకు 2025–2026 ఆర్థిక సంవత్సరంలో రూ.19,814 కోట్ల ఆదాయ ఆవశ్యకత ఉందని తెలిపారు. కాగా, ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రస్తుత టారిఫ్(టారిఫేతర ఆదాయం కలుపుకుని) రూ.9,421కోట్లు వస్తుందని అంచనా వేయగా, రూ.10,393 కోట్లు రెవెన్యూ లోటు ఏర్పడుతుందని వివరించారు.

తెరపైకి వ్యవసాయాధికారుల పదోన్నతులు

ఉమ్మడి జిల్లాలో పాలనాపరమైన మార్పునకు అవకాశం

ఖమ్మంవ్యవసాయం: వ్యవసాయ శాఖలో పదేళ్లకు పైగా ఎదురుచూస్తున్న పదోన్నతుల వ్యవహారం తాజాగా తెరపైకి వచ్చింది. సహాయ వ్యవసాయ సంచాలకులు(ఏడీఏ) మొదలు ఆపై స్థాయి అధికారులకు ఉద్యోగోన్నతి కల్పించే వ్యవహారాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఏడీఏలకు డీడీఏ(డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్)లుగా, డీడీఏలకు జేడీఏ(జాయింట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్)లుగా, జేడీఏలకు అడిషనల్ డైరెక్టర్ హోదాలో పదోన్నతి కల్పించనున్నట్లు సమాచారం. వ్యవసాయ శాఖకు చెందిన ఓ ఉన్నతాధికారి విదేశీ పర్యటనలో ఉండగా, ఆ అధికారి వచ్చాక ప్రక్రియ పూర్తయ్యే అవకాశముందని తెలిసింది. ఇందులో భాగంగా గతంలో ఇక్కడ జిల్లా వ్యవసాయాధికారిగా పనిచేసిన అధికారికి జేడీఏగా పదోన్నతి లభించనుందని, ఆపై ఖమ్మం జిల్లా వ్యవసాయాధికారి పోస్టు జేడీఏ స్థాయి కావడంతో ఆ ఉద్యోగిని ఇక్కడ నియమిస్తారని సమాచారం. అలాగే, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పనిచేస్తున్న ఇద్దరు ఏడీఏలకు డీడీఏలుగా, ఒకరిద్దరు ఏఓలకు ఏడీఏలుగా పదోన్నతులు లభించనున్నాయని వ్యవసాయ శాఖలో చర్చ జరుగుతోంది. తద్వారా ఉమ్మడి జిల్లాలో పాలనాపరమైన మార్పులు జరిగే అవకాశముందని చెబుతున్నారు.

కనువిందు చేసేలా మ్యూజియం

ఐటీడీఏ పీఓ రాహుల్

భద్రాచలం: భద్రాచలం వచ్చే పర్యాటకులు, భక్తులకు కనువిందు చేసేలా గిరిజన మ్యూజియం వద్ద ఏర్పాట్లు చేస్తున్నట్లు ఐటీడీఏ పీఓ బి.రాహుల్ తెలిపారు. బుధవారం ఆయన బోటింగ్, బాక్స్ క్రికెట్ గ్రౌండ్ పనులు, మ్యూజియం లోపల పెయింటింగ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాల పెయింటింగ్‌లతో పాటు గిరిజన వంటకాల స్టాళ్ల నిర్మాణం తదితర పనులు శనివారం లోగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. శ్రీరామనవమికి వచ్చే భక్తులు ఈ మ్యూజియాన్ని సందర్శించేలా సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, డీడీ మణెమ్మ, ఈఈ చంద్రశేఖర్, ఉద్యానవన అధికారి ఉదయ్‌కుమార్, ఏసీఎంఓ రమణయ్య, డీఈ హరీష్, డీఎస్ఓ ప్రభాకర్ రావు, ఏఈ రవి, పంచాయతీ ఈఓ శ్రీనివాస్, మ్యూజియం ఇన్‌చార్జ్ వీరస్వామి పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు సకాలంలో అందించాలి

బూర్గంపాడు: విద్యార్థులు, అభ్యర్థులకు అవసరమైన సర్టిఫికెట్లు సకాలంలో అందించాలని పీఓ రాహుల్ రెవెన్యూ అధికారులకు సూచించారు. బూర్గంపాడు తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్ల సవరణ జాబితా ప్రక్రియను బుధవారం ఆయన పరిశీలించారు. ఓటరు జాబితా సవరణ ఎలా చేస్తున్నారని తహసీల్దార్ ముజాహిద్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన వారంతా ఓటు నమోదు చేసుకునేలా చూడాలన్నారు. యువతకు రాజీవ్ యువ వికాసం పథకంతో ప్రభుత్వం లబ్ధి చేకూరుస్తోందని, ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే వారికి కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలను సకాలంలో అందించాలని అన్నారు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు రెవెన్యూ సిబ్బందిని రీచ్‌ల వద్ద ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.



బూర్గంపాడులో ఓటరు జాబితా సవరణను పరిశీలిస్తున్న రాహుల్

క్రీడా దుస్తుల సరఫరాకు టెండర్ల ఆహ్వానం

భద్రాచలంటౌన్: గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని క్రీడా పాఠశాలలకు దుస్తుల (టీ షర్ట్, షార్ట్, ట్రాక్ షూట్) సరఫరాకు సీల్డ్ షార్ట్ టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు పీఓ రాహుల్ ఒక ప్రకటనలో తెలిపారు. టెండర్‌లో పాల్గొనే వారు పాన్ కార్డు, టిన్ కార్డు నంబర్లు, బ్యాంక్ ఖాతా కలిగి ఉండాలని, ఆసక్తి గల వారు గురువారం నుంచి ఈనెల 24 వరకు ఐటీడీఏ కార్యాలయంలో టెండర్ షెడ్యూళ్లు పొందవచ్చని పేర్కొన్నారు. ఇందుకోసం రూ.1000 ఐటీడీఏ భద్రాచలం పేరుతో ఎస్‌బీఐ భద్రాచలం బ్రాంచ్‌లో చెల్లుబాటు అయ్యేలా డీడీ సమర్పించాల్సి ఉంటుందని వివరించారు. ధరావత్ సొమ్ము రూ.లక్ష డీడీ, టెండర్ షెడ్యూల్‌ను బాక్స్‌లో వేస్తే 24వ తేదీ మధ్యాహ్నం హాజరైన వారి సమక్షంలో బాక్స్ తెరిచి తుది నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

'పది' పరీక్షలకు సిద్ధం



- జిల్లాలో 73 కేంద్రాలు, హాజరుకానున్న 12,282 మంది..
- విద్యార్థులకు ఐదు నిమిషాల వెసులుబాటు
- పోలీస్‌స్టేషన్లకు చేరిన ప్రశ్నపత్రాలు

కొత్తగూడెంఅర్బన్ : జిల్లాలో ఈనెల 21 నుంచి జరుగనున్న పదో తరగతి పరీక్షలకు విద్యాశాఖ అధికారులు సర్వం సిద్ధం చేశారు. గత వారం రోజులుగా ఎంఈఓలు, హెచ్‌ఎంలతో వీడియో, టెలీ కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు, సౌకర్యాలపై ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేశారు. జిల్లాలోని 73 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనుండగా గురువారమే తరగతి గదుల్లో హాల్‌టికెట్ నంబర్లు వేయనున్నారు. వారం రోజుల క్రితమే ప్రశ్నపత్రాలు కేంద్రాల సమీప పోలీస్ స్టేషన్లకు చేరుకున్నాయి. ఎండల నేపథ్యంలో విద్యార్థులకు ఏమైనా అనారోగ్య సమస్యలు ఎదురైతే చికిత్స చేసేందుకు పరీక్ష కేంద్రాల వద్ద వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారు. పరీక్షల సమయానికి అనుగుణంగా బస్సులు నడిపించాలని ఆర్టీసీ అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, ఫ్యాన్లు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.

రేపటి నుంచి ఏప్రిల్ 4 వరకు..

పదో తరగతి పరీక్షలు ఈనెల 21 నుంచి ఏప్రిల్ నాలుగో తేదీ వరకు జరుగనున్నాయి. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12. 30 వరకు పరీక్షలు జరుగనుండగా 9.35 నిమిషాల వరకు విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతిస్తారు. అయితే గంట ముందుగానే కేంద్రాల వద్దకు చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. జిల్లాలో 73 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 12,282 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్షల నిర్వహణకు 73 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, ఐదుగురు ఫ్లయింగ్ స్క్వాడ్లు, ఏడుగురు రూట్ అధికారులు, 73 మంది డిపార్టుమెంటల్ అధికారులు, 26 మంది సెంటర్ కస్టోడియన్లు, 73 మంది సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేశారు. ప్రశ్నపత్రాల రవాణా, పరీక్ష అనంతరం సమాధానపత్రాల బండిళ్లను పోస్టాఫీసులకు చేరవేసేందుకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు పరిసర ప్రాంతాల్లో 163 సెక్షన్ అమలు చేస్తున్నారు. పరీక్ష సమయంలో కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని ఇప్పటికే అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

జిల్లాలోని పాఠశాలలు, విద్యార్థుల వివరాలిలా..

మేనేజ్‌మెంట్	స్కూళ్లు	బాలురు	బాలికలు	మొత్తం
ప్రభుత్వ	13	279	209	488
స్థానిక సంస్థలు	97	1731	1511	3242
ఎయిడెడ్	09	163	309	472
గిరిజన సంక్షేమ	51	1077	1321	2398
టీఎస్‌ఎంఆర్‌ఎస్	08	114	112	226
టీఎస్‌టీడబ్ల్యూఆర్‌ఎస్	11	380	457	837
కేజీబీవీ	14	00	519	519
ఎంజేపీటీ	11	297	293	590
ప్రైవేట్	126	1948	1562	3510

విద్యార్థులు సకాలంలో చేరుకోవాలి



విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకోవాలి. పరీక్ష 9.30 గంటలకు ప్రారంభం కానుండగా ఆ తర్వాత ఐదు నిమిషాల వరకు కూడా అనుమతిస్తాం. పరీక్ష సమయంలో ఆర్టీసీ అధికారులు నడిపే బస్సులను సద్వినియోగం చేసుకోవాలి. పరీక్ష కేంద్రాల్లో ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం.

– వెంటేశ్వరాచారి, డీఈఓ

అంగన్‌వాడీల్లోనూ 'హాఫ్ డే'

- ఎండల నేపథ్యంలో మధ్యాహ్నం వరకే అంగన్‌వాడీ కేంద్రాలు
- ఒకేపూట నిర్వహించాలని ప్రభుత్వ నిర్ణయం
- వేసవిలో చిన్నారులకు ఉపశమనం

భద్రాచలంఅర్బన్ : ప్రభుత్వ పాఠశాలలతో సమానంగా అంగన్‌వాడీ కేంద్రాలను సైతం ఈ ఏడాది వేసవికాలంలో ఒంటిపూట నిర్వహించాలని నిర్ణయించిన ప్రభుత్వం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఫిబ్రవరి నుంచే భానుడు భగ్గుమంటుండగా మార్చి రెండో వారం నుంచి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. ఈ తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో చిన్నారుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇరుకు గదుల్లో ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయ్యే చిన్నారులకు ఉపశమనం కలుగుతోంది. పాఠశాలలను మాత్రమే హాఫ్‌డే స్కూళ్లు నిర్వహించే ప్రభుత్వం ఈసారి అంగన్‌వాడీ కేంద్రాలకూ ఈ అవకాశం కల్పించింది. ఈనెల 15 నుంచే ఈ నిర్ణయం అమలు కాగా, మే 31 వరకు ఒక్కపూటే కేంద్రాలు కొనసాగుతాయని, ఉదయం 8 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 12.30 గంటలకు ముగుస్తాయని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ కాంతి వెస్లే ఉత్తర్వులు జారీ చేశారు.

చిన్నారులకు ఉపశమనం..

జిల్లా వ్యాప్తంగా 2,060 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా 853 మాత్రమే పక్కా భవనాలు ఉన్నాయి. 445 సెంటర్లను ప్రభుత్వ భవనాలు, పాఠశాలల్లో నిర్వహిస్తున్నారు. 762 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఈ కేంద్రాల పరిధిలో 5,967 మంది గర్భిణులు, 6,681 మంది బాలింతలు, మూడేళ్ల లోపు చిన్నారులు 30,941 మంది, 3 – 6 ఏళ్ల లోపు వారు 25,479 మంది ఉన్నారు. అద్దె భవనాలు, ఇతర ప్రభుత్వ భవనాల్లో నిర్వహిస్తున్న కేంద్రాల్లో వసతులు అంతంతమాత్రంగానే ఉండగా వేసవిలో చిన్నారులకు ఇబ్బందులు తప్పడం లేదు. వేడి, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలను కేంద్రాలకు పంపడం లేదు. ఈ క్రమంలో ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను సైతం ఒంటిపూట నిర్వహించాలని నిర్ణయించింది. దీంతో చిన్నారులకు వేడి, ఉక్కపోత నుంచి ఉపశమనం లభిస్తోంది. ఇదిలా ఉండగా అద్దె భవనాల్లో కొనసాగుతున్న కేంద్రాల్లో ఫ్యాన్లు లేవు. తగినంత గాలి, వెలుతురు లేక చిన్నారులు, గర్భిణులు, బాలింతలు వేడితో ఇబ్బంది పడుతున్నారు.



భద్రాచలంలోని ఓ అంగన్‌వాడీ కేంద్రంలో ఆడుకుంటున్న చిన్నారులు

మధ్యాహ్నం వరకే..

ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తోంది. వేసవి కాలం దృష్ట్యా మధ్యాహ్నం 12.30 గంటల వరకే వారికి ఆహారం సమకూర్చేలా ఏర్పాట్లు చేశారు. మరోవైపు ఎండ, ఉక్కపోతతో చిన్నారులు, గర్భిణులకు ఇబ్బందులు ఎక్కువగా ఉంటాయని, ఆ సమయంలో బయటకు వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. అయితే 12.30 గంటల వరకే అయినా ఎండ ప్రభావం పడుతుందని, ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని, పనిచేయని చోట మరమ్మతు చేయించాలని, సరైన వసతులు కల్పించాలని గర్భిణులు, బాలింతలు కోరుతున్నారు.

ఉత్తర్వులు అందాయి



అంగన్‌వాడీ కేంద్రాలను ఒంటిపూట నిర్వహించాలని రాష్ట్ర మహిళా, శిశు, వయోవృద్ధులు, దివ్యాంగుల శాఖ నుంచి ఉత్తర్వులు అందాయి. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకే కేంద్రాలు నిర్వహిస్తున్నాం. మే 31 వరకు ఇలాగే కొనసాగుతాయి. దీంతో చిన్నారులకు కొంత ఇబ్బంది తగ్గుతోంది.

– స్వర్ణలత లెనీనా, జిల్లా సంక్షేమ శాఖ అధికారి

క్లుప్తంగా

ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విద్యాచందన

పాల్వంచరూరల్: ఉపాధి కూలీలకు పని ప్రదేశాల్లో గ్రామపంచాయతీల ద్వారా తాగునీరు, నీడ కోసం టెంట్లు ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్, డీఆర్‌డీఓ విద్యాచందన ఆదేశించారు. మండల పరిధిలోని కేశవాపురం గ్రామంలో ఉపాధి పనులు, నర్సరీలను బుధవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. ఎండ తీవ్రంగా ఉన్నందున ఉదయం ఏడుగంటలకే పని ప్రదేశాలకు చేరుకోవాలన్నారు. రూ.300 వచ్చేలా కొలతల ప్రకారం పనులు చేయాలని సూచించారు. పలుగు, పార, తట్టలు లేని కారణంగా పనులు ఎక్కువగా చేయలేకపోతున్నామని ఈ సందర్భంగా ఉపాధి కూలీలు అదనపు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కె.విజయభాస్కరరెడ్డి, సిబ్బంది రంగా, కృష్ణవేణి, శంకర్ పాల్గొన్నారు.

ఏజెంట్ల వద్ద సైతం తలంబ్రాల బుకింగ్



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: భద్రాచలంలో జరగనున్న శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కల్యాణ తలంబ్రాలు కావాల్సిన భక్తులు ఖమ్మం డిపో పరిధిలోని ఆర్టీసీ కార్గో ఏజెంట్ల వద్ద బుక్ చేసుకోవచ్చని డిపో మేనేజర్ దినేష్‌కుమార్ తెలిపారు. ఈసందర్భంగా ఖమ్మం కొత్త బస్టాండ్‌లో బుధవారం కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. స్వామి వారి తలంబ్రాలను ఇంటి వద్దే అందించనుండగా, ఖమ్మం మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్(91542 98583), ఖమ్మం పాతబస్టాండ్ ఏజెంట్(97043 45599), కొణిజర్ల ఏజెంట్(85220 12587), నేలకొండపల్లి ఏజెంట్ 83310 06959, బోనకల్ ఏజెంట్(83091 25037)ను సంప్రదించాలని సూచించారు.

ఇసుక లారీ సీజ్



పోలీసులు సీజ్ చేసిన ఇసుక లారీ

దమ్మపేట: ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని బుధవారం రాత్రి పోలీసులు సీజ్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం... రాత్రి వేళ ఎస్సై సాయికిషోర్ రెడ్డి సిబ్బందితో కలసి మండల పరిధిలోని జలవాగులో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో ఏపీ నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న లారీని గుర్తించి, స్టేషన్‌కు తరలించారు. లారీని సీజ్ చేసి కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వైస్ ఎంపీపీ మృతి



ప్రసాద్ (ఫైల్)

టేకులపల్లి: రోడ్డు ప్రమాదంలో వైస్ ఎంపీపీ మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. టేకులపల్లి ఎస్‌ఐ పి.సురేష్ కథనం ప్రకారం.. మండలంలోని సులానగర్ గ్రామానికి చెందిన, తాజా మాజీ వైస్ ఎంపీపీ ఉండేటి ప్రసాద్ (56) బుధవారం రాత్రి బైక్‌పై కొత్తగూడెం నుంచి స్వగ్రామానికి వస్తున్నాడు. అదే సమయంలో లక్ష్మీదేవిపల్లి మండలం వేపలగడ్డకు చెందిన పాయం రాకేష్, టేకులపల్లి మండలం బోడు కొత్తగూడేనికి కిషోర్ మరో బైక్‌పై కొత్తగూడెం వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో బోరింగ్ తండా సమీపంలో కొత్తగూడెం–ఇల్లెందు ప్రధాన రహదారిపై రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి. ఉండేటి ప్రసాద్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడ్డ మరో ఇద్దరిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. వారిలో రాకేష్ పరిస్థితి విషమంగా ఉండటంతో ఎంజీఎంకు తీసుకెళ్లారు. కాగా మృతుడు ప్రసాద్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, సురేందర్ సందర్శించి సంతాపం తెలిపారు.

ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి

రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు హేమంతరావు

పాల్వంచరూరల్: పాలకులు వ్యవసాయ రంగానికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భాగం హేమంతరావు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని పెద్దమ్మగుడి సమీపంలో బుధవారం నిర్వహించిన రైతు సంఘం జిల్లాస్థాయి జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో వ్యవసాయరంగం సంక్షోభంలో పడిందని అన్నారు. స్వామినాథన్ సిఫార్సులను అమలు చేసి రైతులను, వ్యవసాయరంగాన్ని కాపాడాలని కోరారు. వ్యవసాయరంగం బలంగా ఉంటేనే అన్ని రంగాలు బలంగా ఉంటాయన్నారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యమివ్వాలని, గత ప్రభుత్వం ఎత్తేసిన వ్యవసాయ యంత్రాల సబ్సిడీని పునరుద్ధరించాలన్నారు. రైతులు సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కే.సాబీర్‌పాషా, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ముత్యాల విశ్వనాథం, అధ్యక్షుడు చంద్ర నరేంద్రకుమార్, నాయకులు కల్లూరి వెంకటేశ్వర్లు, నరాటి ప్రసాద్, శ్రీనివాస్, వీసంశెట్టి పూర్ణచందర్ రావు, అడుసుమల్లి సాయిబాబా, దస్రూ, హన్మంతరావు, బండి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి రాహుల్, సుధాకర్, యూసుఫ్, రమేష్, లక్ష్మి, బిక్షం, కొంగర అప్పారావు, నిమ్మల రాంబాబు, ఇట్టి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భాగం హేమంతరావు

తొమ్మిదో తరగతి బాలికతో అసభ్య ప్రవర్తన

డిప్యూటీ వార్డెన్‌ను చితకబాదిన గ్రామస్తులు

టేకులపల్లి: విద్యార్థినిపట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన డిప్యూటీ వార్డెన్‌ను తల్లిదండ్రులు, గ్రామస్తులు బుధవారం చితకబాదారు. మండలంలోని గంగారం ఆశ్రమ పాఠశాల డిప్యూటీ వార్డెన్ (హిందీ టీచర్) మాలోత్ ప్రతాప్‌సింగ్ మంగళవారం మద్యం తాగి విధులకు హాజరయ్యాడు. మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో పాఠశాల ఆవరణలో తొమ్మిదో తరగతి బాలికపై చేతులు వేసి అసభ్య పదాలు మాట్లాడుతూ ఇబ్బందికి గురి చేశాడు. బాలిక ప్రతిఘటించి డిప్యూటీ వార్డెన్‌ను నెట్టివేసింది. అదే సమయంలో వంట చెరకు డబ్బుల కోసం వచ్చిన గ్రామస్తులకు బాలిక ఏడ్చుకుంటూ విషయం తెలిపింది. దీంతో వారు ప్రశ్నించగా తప్పయిందని చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. గ్రామస్తులు విషయం తెలపడంతో బాలిక తల్లిదండ్రులు, గ్రామపెద్దలు, బంధువులు రాత్రి పాఠశాలకు రాగా, డిప్యూటీ వార్డెన్ అందుబాటులో లేకుండా పోయాడు. దీంతో బుధవారం మళ్లీ సుమారు వంద మందికి పైగా పాఠశాలకు చేరుకుని డిప్యూటీ వార్డెన్, హెచ్‌ఎంలను నిలదీశారు. డిప్యూటీ వార్డెన్ పశ్చాత్తాపం లేకుండా ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతుండటంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు చితకబాదారు. దీంతో అక్కడి నుంచి పారిపోయాడు. బోడు ఎస్‌ఐ పొడిశెట్టి శ్రీకాంత్, డిప్యూటీ తహసీల్దార్ ముత్తయ్య, ఏటీడీవో రాధ పాఠశాలకు చేరుకుని విచారణ చేపట్టారు. బాలిక, తల్లిదండ్రులు, ప్రత్యక్ష సాక్షులతో మాట్లాడి వివరాలు నమోదు చేసుకున్నారు. కాగా ఈ ఘటనలో డిప్యూటీ వార్డెన్‌పై హెచ్‌ఎం జగన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మద్యం మత్తులో పాఠశాలకు వచ్చి, కోరిక తీర్చాలని బాలికను బలవంతం చేయబోయిన డిప్యూటీ వార్డెన్‌ను కఠినంగా శిక్షించాలని, ఉద్యోగం నుంచి తొలగించాలని తల్లిదండ్రులు ఫిర్యాదు చేయగా, పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా పాఠశాల నుంచి తిరిగి వెళ్తున్న బోడు పోలీసులకు బైక్‌పై వెళ్తున్న డిప్యూటీ వార్డెన్ తారసపడటంతో అదుపులోకి తీసుకుని బోడు పోలీసు స్టేషన్‌కు తరలించారు.



డిప్యూటీ వార్డెన్‌కు దేహశుద్ధి చేస్తున్న గ్రామస్తులు

పదెకరాల్లో ఆయిల్‌పామ్ తోట దగ్ధం

షార్ట్ సర్క్యూటే కారణమని రైతుల ఆవేదన

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలం బావోజీ తండాలో పది ఎకరాల్లోని ఆయిల్‌పామ్ తోటలో చెట్లు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా కాలిపోయాయి. బాధిత రైతు బానోత్ శివలాల్ తెలిపిన వివరాలు... బుధవారం మధ్యాహ్నం తోటలో మంటలు చెలరేగాయనే సమాచారంతో వెళ్లగా కాపుదశకు వచ్చిన ఆయిల్‌పామ్ పామాయిల్ చెట్లు కాలిపోయాయని వాపోయారు. తోట మీదుగా వెళ్తున్న విద్యుత్ వైర్లను తొలగించాలని, అందుకు అయ్యే వ్యయం కూడా భరిస్తానని చెప్పినా అధికారులు పట్టించుకోకపోవడం ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు. వడగాలుతో విద్యుత్ తీగలు ఒకదాని కొకటి తాకగా షార్ట్ సర్క్యూట్ జరిగిందని చెప్పారు. కాగా, శివలాల్ తోటలో మొదలైన మంటలు పక్క తోటకు సైతం వ్యాపించగా సుమారు పదెకరాల్లో తోట కాలిపోయింది. ఇప్పటికే గెలలు వేయగా త్వరలోనే అమ్మేందుకు సిద్ధమవుతుండగా జరిగిన ఈ ప్రమాదంలో నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరారు.

బైక్, లారీ ఢీ

ఐటీఐ విద్యార్థి మృతి, మరొకరికి తీవ్రగాయాలు

బూర్గంపాడు: మండల పరిధిలోని సందెళ్లరామాపురం వద్ద జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐటీఐ విద్యార్థి మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. దుమ్ముగూడెం మండలం రామారావుపేట గ్రామానికి చెందిన వర్సా చైతన్య బూర్గంపాడు మండలం కృష్ణసాగర్‌లోని ప్రభుత్వ ఐటీఐలో చదువుతున్నాడు. సందెళ్ల రామాపురం గ్రామంలోని తన మేనమామ కారం నాగరాజు ఇంట్లో ఉంటూ రోజూ కళాశాలకు వెళ్లి వస్తున్నాడు. బుధవారం ఉదయం సందెళ్ల రామాపురం గ్రామానికి చెందిన ఆతుకూరి రాకేశ్, చైతన్య మోటార్‌సైకిల్‌పై ముసలిమడుగు గ్రామానికి వెళ్లి సందెళ్లరామాపురం తిరిగి వస్తున్నారు. సందెళ్లరామాపురం వద్ద రోడ్డుదాటుతున్న క్రమంలో వెనుక నుంచి వేగంగా వస్తున్న లారీ మోటార్‌సైకిల్‌ను ఢీ కొట్టింది. దీంతో రాకేశ్, చైతన్యలు లారీ టైర్ల కింద పడిపోయారు. తీవ్రగాయాలై చైతన్య (17) అక్కడికక్కడే మృతిచెందాడు. రాకేశ్‌కు తీవ్ర గాయాలు కావటంతో భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. చైతన్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుని తండ్రి వర్సా వీరస్వామి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. లక్ష్మీపురం గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ వల్లోజు రాజారావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.



చైతన్య(ఫైల్)

బడ్జెట్‌లో అన్ని వర్గాలకూ అన్యాయం

మాజీ మంత్రి వనమా

పాల్వంచ: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అన్ని వర్గాల ప్రజలకూ అన్యాయం జరిగిందని మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బడ్జెట్ పేద ప్రజలకు వ్యతిరేకంగా ఉందని, ఆరు గ్యారంటీలతో పాటు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించారని ఆరోపించారు. నిరుద్యోగులకు ఒక్క హామీ ఇవ్వలేదని, విద్యా బోధన గురించి ప్రస్తావనే లేదని పేర్కొన్నారు. ప్రజాధనాన్ని పార్టీకి పంచిపెట్టే కుట్ర చేస్తున్నారని విమర్శించారు. రేషన్ కార్డులు రాక పేదలు అల్లాడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



వనమా వెంకటేశ్వరరావు

గతానికి భిన్నంగా ప్రస్తుత బడ్జెట్

సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్‌పాషా



సాబీర్‌పాషా

సూపర్‌బజార్(కొత్తగూడెం): గత ప్రభుత్వాల బడ్జెట్‌కు భిన్నంగా ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టిందని, గతంలో అంకెల గారడీ స్పష్టంగా కనిపించగా ప్రస్తుత బడ్జెట్ వాస్తవానికి దగ్గరలో ఉందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత బడ్జెట్ కంటే రూ.14.505 కోట్లు తగ్గుదలతో బడ్జెట్ ప్రవేశపెట్టడం ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు కేవలం రూ. 23 వేల కోట్లు మాత్రమే కేటాయించడం సరికాదని, విద్య, సంక్షేమ రంగానికి అన్యాయం చేశారని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల అభ్యున్నతికి, సంక్షేమానికి ప్రాధాన్యత కల్పించడం అభినందనీయమని తెలిపారు. ఆయా రంగాలకు కేటాయించిన బడ్జెట్‌లోని ప్రతిపైసా పూర్తిస్థాయిలో ఖర్చు చేస్తేనే ప్రజలు హర్షిస్తారని పేర్కొన్నారు.

బొమ్మనపల్లి విద్యార్థినికి కలెక్టర్ ప్రశంస

టేకులపల్లి: మండలంలోని బొమ్మనపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థిని గాయత్రిని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ బుధవారం అభినందించారు. కలెక్టర్ ప్రయోగాత్మకంగా చేసిన బాలమేళా కార్యక్రమంలో భాగంగా ఎఫ్ఎల్ఎన్ ద్వారా అమలు చేసిన రాయటం, చదవడం అనే విధానం ద్వారా రెండో తరగతి విద్యార్థి గాయత్రి వేదికపై కథను చదివి వినిపించింది. దీంతో కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని పాత కొత్తగూడెంలో ఉన్న జిల్లా విద్యా వనరుల కేంద్రంలో జరిగిన బాలమేళా ముగింపు ఉత్సవంలో ఆయన మాట్లాడుతూ బొమ్మనపల్లి విద్యార్థులు ప్రదర్శించిన నాటిక, పద్యం, కథలతో ప్రతిభ చాటారని ప్రశంసించారు. బొమ్మనపల్లి పాఠశాల బాలమేళాలో బెస్ట్ స్కూల్‌గా ఎంపిక కాగా, హెచ్‌ఎం ఎం.జ్యోతిరాణిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ వెంకటేశ్వరాచారి, జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి నాగరాజ శేఖర్, టేకులపల్లి ఎంఈఓ జగన్, జర్పల పద్మ పాల్గొన్నారు.



హెచ్‌ఎం జ్యోతిరాణిని సన్మానిస్తున్న కలెక్టర్ జితేష్, చిత్రంలో ప్రతిభ చాటిన చిన్నారులు

పెనుబల్లి యూపీఎస్‌కూ బెస్ట్ స్కూల్ అవార్డు

చుంచుపల్లి: మండల స్థాయిలో పెనుబల్లి యూపీఎస్ పాఠశాల ఉత్తమ స్కూల్‌గా ఎంపిక కాగా హెచ్‌ఎం నిర్మలకు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అవార్డు అందజేశారు. పాఠశాలలో ఆహ్లాద వాతావరణం, పరిసరాల పరిశుభ్రత, చెట్ల పెంపకం తదితర అంశాలను పరిశీలించి ఉత్తమ పాఠశాలగా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ఎం.రాజయ్య, శారద, హరిలాల్, విజయ, సుజాత,నాగరాజు శేఖర్, బాలాజీ పాల్గొన్నారు.

నిందితుల రిమాండ్

కామేపల్లి: సింగరేణి మండలం కొత్తకమలాపురం గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వడ్డే రంగారావుపై ఐదు రోజుల క్రితం దాడి చేసి, హత్యకు యత్నించిన వారిని బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. ఈమేరకు నెమలిపురి తండాకు చెందిన వేముల రాధాకృష్ణతో పాటు మరో ఐదుగురు ఆర్ఎంపీని హత్య చేసేందుకు ప్రయత్నించారని అందిన ఫిర్యాదుతో అరెస్ట్ చేశామని వెల్లడించారు.

ఆలయంలో రెండోసారి చోరీ

అశ్వారావుపేటరూరల్: మండలంలోని పాత మామిళ్లవారిగూడెం గ్రామ శివారులో ఉన్న శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయం గేటు తాళాన్ని ధ్వంసం చేసి లోపలికి ప్రవేశించిన దుండగులు లోపల ఉన్న హుండీని తెరిచి నగదు అపహరించారు. హుండీలో సుమారు రూ.10 వేలు ఉంటాయని భక్తులు చెప్పారు. కాగా, ఇదే ఆలయంలో గత జనవరి 9న హుండీ పగులగొట్టి రూ. 40 వేలు చోరీ చేశారు. ఆలయంలో రెండోసారి చోరీ జరిగిన నేపథ్యంలో పోలీసులు దృష్టి పెట్టాలని భక్తులు కోరుతున్నారు. చోరీపై తమకు ఫిర్యాదు అందలేదని ఎస్సై యయాతి రాజు తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

అశ్వారావుపేటరూరల్: అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని బుధవారం పోలీసులు సీజ్ చేశారు. ఎస్సై టీ యయాతి రాజు కథనం ప్రకారం.. మండలంలోని వినాయకపురం నుంచి బొలెరో వాహనంలో పది బస్తాల్లో ఐదు క్వింటాళ్ల బియ్యాన్ని ఏపీలోని ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం వైపు తరలిస్తుండగా అశ్వారావుపేట బస్టాండ్ సెంటర్‌లో పోలీసులు పట్టుకున్నారు. వాహనం డ్రైవర్ దారం చిన్న శ్రీనివాస్, వాహన యజమాని ఆదివిష్ణుపై కేసు నమోదు చేశారు. బియ్యాన్ని పౌరసరఫరాల అధికారులకు అప్పగించి వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

బూర్గంపాడు: మండల పరిధిలోని ముసలిమడుగు గ్రామం వద్ద ఉన్న బ్రిడ్జి సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం చెట్టుకు ఉరి వేసుకుని వేలాడుతున్న వ్యక్తిని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో ఎస్‌ఐ రాజేష్ ఘటనా ప్రాంతానికి చేరుకుని ట్రాక్టర్ సాయంతో చెట్టుకు ఉరివేసుకున్న వ్యక్తి మృతదేహాన్ని కిందకు దించి పోస్టుమార్టం నిమిత్తం భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవటంతో మృతుడు ఎవరనేది గుర్తించలేకపోయారు. మృతుడి వివరాలు తెలిస్తే సమాచారమందించాలని ఎస్‌ఐ రాజేష్ కోరారు.

పురుగులమందు తాగి యువకుడి ఆత్మహత్య



అయినవిల్లి నాని (ఫైల్)

దమ్మపేట: పురుగుల మందు తాగి చికిత్స పొందుతున్న యువకుడు బుధవారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం... దమ్మపేట గ్రామానికి చెందిన అయినవెల్లి నాని(28) కొంతకాలంగా వేరొక మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. దీంతో భార్య సునీత, కుటుంబ సభ్యులు మంగళవారం మందలించారు. దీంతో మనస్తాపం చెంది అదేరోజు రాత్రి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు దమ్మపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి ఖమ్మం తీసుకెళ్లగా, చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడికి మూడేళ్లలోపు కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్సై సాయికిషోర్ రెడ్డి తెలిపారు.

నాటుసారా స్వాధీనం

పాల్వంచరూరల్: మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామంలో బుధవారం ఎక్సైజ్ అధికారులు నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయానికి రావాలని చెప్పి విక్రయదారులను వదిలేసి వెళ్లినట్లు సమాచారం. ఈ విషయమై ఎక్సైజ్ సీఐ ప్రసాద్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. ఆయన స్పందించలేదు.

మర్కోడు రేషన్ షాపు సీజ్

గుండాల: కొంతకాలంగా రేషన్‌షాపు డీలర్ విధులు హాజరు కాకుండా సరుకులు ఇవ్వకపోవడంతో ఇల్లెందు సివిల్ సప్లయీస్ అధికారులు బుధవారం దుకాణాన్ని సీజ్ చేశారు. ఆళ్లపల్లి మండలం మర్కోడు పంచాయతీ కేంద్రంలోని రేషన్ షాపు సేల్స్‌మెన్ తరచూ విధులకు గైర్హాజరు అవుతున్నాడని, బియ్యం ఇవ్వడం లేదని స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో సివిల్ సప్లయీస్ డీటీ యాకూబ్‌పాషా తదితరులు తనిఖీ చేశారు. బుధవారం గ్రామస్తుల సమక్షంలో తాళాలు పగులగొట్టి వీడియో తీస్తూ స్టాక్‌ను పరిశీలించారు. రికార్డులు పరిశీలించి 41 క్వింటాళ్ల బియ్యం ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. పలుమార్లు విచారణ కోసం ప్రయత్నించినా సేల్స్‌మన్ నుంచి స్పందన లేకపోవడంతో షాపును సీజ్ చేశారు. రేషన్ షాపు నిర్వహణ బాధ్యతలను మరో సేల్స్‌మెన్‌కు అప్పగించాలని జీసీసీ అధికారులను కోరామని, నివేదిక అందించామని డీటీ వివరించారు.

విద్యుత్ సేవల్లో సాంకేతికత..

వినియోగదారులతో పాటు విద్యుత్ శాఖకు సౌకర్యవంతంగా ఉండేలా టీజీ ఎన్పీడీసీఎల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తోంది. ఇందులో భాగంగా 20 అంశాలతో కూడిన యాప్‌ను అందుబాటులోకి తీసుకు రాగా.. వినియోగదారులు తమ ఫోన్ నుంచే సమస్యలపై ఫిర్యాదు చేసే అవకాశం లభిస్తోంది. వివిధ ఫిర్యాదులు, బిల్లులు, నూతన సర్వీసులు, మీటర్ పేరు మార్పిడి తదితర అంశాలను ఈ యాప్ ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లొచ్చు. వినియోగదారులకు ఈ యాప్‌తో మేలు జరగడమే కాక నేరుగా సమస్యలు తెలుసుకునేందుకు అధికారులకూ ఉపయోగపడుతోంది. అంతేకాక ఉద్యోగుల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతుందని భావిస్తున్నారు. – ఖమ్మంవ్యవసాయం



- 20 అంశాలతో టీజీ ఎన్పీడీసీఎల్ యాప్
- ఘటనలు, ఫిర్యాదులు నమోదు చేసేలా రూపకల్పన
- ఇటు వినియోగదారులకు లబ్ధి.. ఉద్యోగుల్లో జవాబుదారీ తనం

యాప్‌లోని అంశాలు ఇలా..

- **రిపోర్ట్ ఆన్ ఇన్సిడెంట్** : ఎక్కడైనా ఎలాంటి ఘటన జరిగినా ఇందులో జీపీఎస్ లొకేషన్ ద్వారా ఫొటో తీసి పంపొచ్చు. తద్వారా సంబంధిత అధికారి పరిశీలించి పరిష్కరించేందుకు వీలవుతుంది.
- **కన్స్యూమర్ గ్రీవెన్స్ : న్యూ కంప్లైంట్** : వినియోగదారులకు సంబంధించి సమస్యలను నేరుగా ఇందులో పొందుపర్చవచ్చు. మీటర్ నంబర్, సమస్య వివరాలు నమోదు చేస్తే పరిష్కరిస్తారు.
- **కంప్లైంట్ స్టేటస్** : ఫిర్యాదు చేసిన సమస్య స్థితిగతులను ఇందులో చూసుకునే సౌలభ్యం ఉంది.
- **రీ ఓపెన్ కంప్లైంట్** : ఫిర్యాదు చేసిన సమస్యపై సంతృప్తి చెందకపోతే మళ్లీ అధికారుల దృష్టికి తీసుకెళ్లవచ్చు.
- **సెల్ఫ్ రీడింగ్** : ఇందులో వినియోగదారులు సెల్ఫ్ రీడింగ్ తీసుకునే వెసులుబాటు కల్పించారు. తద్వారా సిబ్బంది వచ్చే వరకు వేచి ఉండాల్సిన పని ఉండదు.
- **పే బిల్స్** : నెలవారీ విద్యుత్ బిల్లులను వినియోగదారుల సర్వీస్ నంబర్ ఆధారంగా చెల్లించవచ్చు. ఇది సులభమే కాక సమయం ఆదా అవుతుంది.
- **బిల్ హిస్టరీ** : చెల్లించిన విద్యుత్ బిల్లుల వివరాలు తెలుసుకుని నెల వారీగా హెచ్చుతగ్గులను నిర్ధారించుకోవచ్చు.
- **ఆన్‌లైన్ పేమెంట్ హిస్టరీ** : ఆన్‌లైన్ ద్వారా చెల్లించిన బిల్లుల తాలూకు సమాచారం ఇందులో ఉంటుంది. ఆన్‌లైన్ ద్వారా చెల్లించిన బిల్లుల సమాచారం తెలుసుకోవచ్చు.
- **కొత్త సర్వీస్ స్థితి** : కొత్త సర్వీసుల మంజూరు స్థితిగతులను ఎప్పటికప్పుడు దరఖాస్తు నంబర్ ఆధారంగా తెలుసుకోవచ్చు.
- **లింక్ ఆధార్–మొబైల్** : వినియోగదారుల ఆధార్, సెల్‌నంబర్లు లింక్ చేసుకోవడం ద్వారా విద్యుత్ బిల్లుల సమాచారం ఫోన్‌కు అందుతుంది.
- **డొమెస్టిక్ బిల్ క్యాలుక్యులేటర్** : వినియోగదారుల నెలవారీ విద్యుత్ వినియోగం, మీటర్ రీడింగ్ వివరాలు ఇందులో పొందుపరిస్తే బిల్లు తాలూకా పూర్తి సమాచారం వస్తుంది.
- **కొత్త కనెక్షన్ ఎలా తీసుకోవాలి** : కొత్త విద్యుత్ కనెక్షన్ తీసుకోవడానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇందులో ఉంటాయి.
- **పేరు, లోడ్ మార్పు** : విద్యుత్ మీటర్ పేరు మార్పుపై వివరాలు, లోడ్ సమాచారం తెలుసుకుని దరఖాస్తు చేసుకోవచ్చు.
- **పవర్ కంజమ్షన్ గైడ్‌లైన్స్** : ఏ ఉపకరణాలు ఎంత వాడితే ఎంత విద్యుత్ వినియోగం అవుతుందో తెలుస్తుంది.
- **టారిఫ్ డిటైల్స్** : విద్యుత్ వినియోగం, చార్జీల వివరాలు కేటగిరీల వారీగా ఇందులో సవివరంగా ఉంటాయి. గృహవినియోగదారులు, గృహేతర వినియోగదారులు, పరిశ్రమల తదితరాల వివరాలు కేటగిరీల వారీగా చార్జీల వివరాలు పొందుపర్చబడి ఉంటాయి.
- **ఎనర్జీ సేవింగ్ టిప్స్** : ఇందులో విద్యుత్ ఉపకరణాలు వాడుతున్నపుడు పొదుపు కోసం ఆచరించాల్సిన సూచనలు ఉంటాయి.
- **సేఫ్టీ టిప్స్** : విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు ఉంటాయి. ఎప్పటికప్పుడు వినియోగదారులను అప్రమత్తం చేసేందుకు ఉపయోగపడుతుంది.
- **ఫీడ్‌బ్యాక్** : విద్యుత్ సేవల పట్ల వినియోగదారుల అభిప్రాయాన్ని పంచుకోవచ్చు. తద్వారా మెరుగైన సేవలను పొందే అవకాశం ఉంటుంది.
- **మై అకౌంట్** : మై అకౌంట్‌లో వినియోగదారుల పూర్తి వివరాలు ఉంటాయి. మీటర్ తాలూకు వివరాలు, తదితర సమాచారం దీనిలో ఉంటుంది.
- **బిల్లు సమాచారం** : వినియోగదారుల బిల్లులకు సంబంధించిన సమాచారం దీనిలో ఉంటుంది. వినియోగదారుల సర్వీస్ నంబర్ నమోదుచేసి బిల్లు వివరాలు తెలుసుకోవచ్చు.
- **అధికారి వివరాలు** : వినియోగదారుల పరిధిలోని అధికారిని సంప్రదించాలంటే ఇందులో నుంచి తెలుసుకోవచ్చు. ఎటువంటి సందేహాలు ఉన్నా సంబంధిత అధికారిని ఫోన్ ద్వారా సంప్రదించి నివృత్తి చేసుకోవచ్చు.
- **కాంటాక్ట్ అజ్** : దీనిలో 24/7 పనిచేసే టోల్ ఫ్రీ నంబర్లు ఉంటాయి. సమస్యల పరిష్కారం కోసం సంప్రదించవచ్చు. టోల్ ఫ్రీ నంబర్లు 18004250028, 1912.

యాప్ సేవలు ప్రయోజనకరం



వినియోగదారులు తమ మొబైల్ ఫోన్‌లో టీజీఎన్పీడీసీఎల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. తద్వారా సంస్థ సమాచారం తెలుసుకోవడమే కాక మెరుగైన సేవలు పొందొచ్చు. ఈ యాప్ సేవలు అటు వినియోగదారులకే కాక సంస్థకు సైతం ప్రయోజనకరం.

– ఇనుగుర్తి శ్రీనివాసాచారి, ఎస్ఈ, ఖమ్మం సర్కిల్

పీజీ కళాశాలలో కొత్త కోర్సులు

- కాలేజ్ ఆఫ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్‌కు ప్రతిపాదనలు
- జాబితాలో నాలుగు కోర్సులు
- అన్నీ అనుకూలిస్తే వచ్చే విద్యాసంవత్సరంలో ప్రారంభం



ఖమ్మంలోని యూనివర్సిటీ పీజీ కళాశాల

ఖమ్మం సహకారనగర్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు సత్తా చాటేలా విద్యారంగంలోనూ మార్పులు వస్తున్నాయి. దీంతో విద్యార్థులు భవిష్యత్ బాగుండేలా కొత్త కోర్సులు నేర్చుకోవడంపై ఆసక్తి కనబరుస్తున్నారు. ఈనేపథ్యాన విస్తృతమైన ఉపాధి అవకాశాలు ఉండే కోర్సులను ప్రవేశపెట్టేందుకు ఖమ్మంలోని యూనివర్సిటీ పీజీ కళాశాల అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు.

ఉన్నతాధికారులకు ప్రతిపాదన

ఖమ్మంలోని కాకతీయ యూనివర్సిటీ పీజీ కళాశాలలో ప్రస్తుతం ఉన్న కోర్సులకు తోడు ఎంసీఏ, ఎంఏ మ్యాథ్స్, ఎంఏ తెలుగు, మాస్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కోర్సులు ప్రవేశపెట్టాలనే నిర్ణయానికి వచ్చారు. ఈమేరకు కాలేజ్ ఆఫ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (సీడీసీ) డీన్‌కు తాజాగాప్రతిపాదనలు పంపారు. అక్కడి నుంచి అనుమతులు రాగానే వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఆయా కోర్సుల్లో ప్రవేశాలు కల్పించే అవకాశముంది. విద్యార్థుల నుంచి వస్తున్న డిమాండ్ మేరకు ఈ కోర్సులను ప్రతిపాదించినట్లు తెలుస్తోంది.

కమిటీ పరిశీలించాకే..

ప్రస్తుతం నూతన కోర్సులు ప్రవేశపెట్టడానికి కళాశాల నుంచి సీడీసీ డీన్‌కు ప్రతిపాదనలు పంపారు. వీటిని పరిశీలించాక వీసీ, రిజిస్ట్రార్ అనుమతి జారీ చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం ఖమ్మంలో కొత్త కోర్సుల ఆవశ్యకత, వీటిని బోధించేందుకు సరిపడా అధ్యాపకులు ఉన్నారా, ఒకవేళ ప్రవేశపెడితే ప్రవేశాలు ఉంటాయా అన్నది కమిటీ ద్వారా పరిశీలించాక మంజూరు చేసే అవకాశముంది.

ప్రతిపాదనలు పంపాం..



విద్యార్థుల నుంచి వస్తున్న డిమాండ్ మేరకు కొత్త కోర్సు ప్రారంభానికి చర్యలు తీసుకున్నాం. ఇందులో భాగంగా యూనివర్సిటీకి ప్రతిపాదనలు పంపించాం. ఉన్నతాధికారులు పరిశీలించి ఆమోదిస్తే వచ్చే విద్యాసంవత్సరం తరగతులు మొదలయ్యే అవకాశముంది.

– రవికుమార్, ప్రిన్సిపాల్, యూనివర్సిటీ పీజీ కళాశాల, ఖమ్మం

పచ్చని పంట.. పుదీనా!





పుదీనా ఆకు కోస్తున్న కూలీలు (ఇన్‌సెట్)మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధం చేసిన పుదీనా కట్టలు

- మంగాపురంలో విస్తృతంగా సాగు
- రైతులకు నికర ఆదాయం.. కూలీలకూ ఉపాధి
- డ్రిప్ విధానంలో వేసవిలోనూ ఆశాజనకంగా దిగుబడి

తల్లాడ: వాణిజ్య పంటలకు రూ.లక్షల్లో పెట్టుబడి పెడుతున్నా సరైన దిగుబడి రాక రైతులు నష్టపోతున్న ఈ తరుణంలో తల్లాడ మండలం మంగాపురంలో ఒక రైతు మొదలుపెట్టిన పుదీనా సాగు మరికొందరు అదే బాట పట్టేలా స్ఫూర్తినిచ్చింది. దీంతో ఆ గ్రామం పుదీనానే కాక ఇతర ఆకు, కూరల సాగులోనూ మేటిగా నిలుస్తోంది.

ఐదేళ్ల క్రితం ప్రారంభం..

మంగాపురానికి చెందిన రైతు గాదె నరసింహారావు ఐదేళ్ల క్రితం పుదీనా సాగు మొదలుపెట్టాడు. ఈ పంటతో ఆయన లాభాలు గడిస్తుండగా మరికొందరూ అదే బాట పడుతున్నారు. కాగా, నర్సింహరావు నాలుగున్నర ఎకరాల్లో పుదీనా సాగు చేసి డ్రిప్ ఇరిగేషన్ విధానంలో నీరందిస్తున్నాడు. పుదీనాకు తోడు కాకర, దోసకాయ, టమాటా పంటలను కూడా సాగు చేస్తుండగా మంచి ఫలితాలు వస్తున్నాయి. ఒకసారి డ్రిప్ ద్వారా నీరు వదిలితే పంటతా తడుస్తుండడంతో పర్యవేక్షించాల్సిన భారం కూడా తప్పిందని చెబుతున్నారు. పుదీనాతో పాటు గ్రామ రైతులు పాలకూర, తోటకూర, టమాట, దోసకాయ, వంకాయ, బెండకాయ, బీరకాయ వంటి పంటలను కూడా పండిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.


అంటుకట్టే పద్ధతిలో..

పుదీనా సాగులో రైతులు అంటు కట్టే విధానం అవలంబిస్తున్నారు. మొదట అంటుకట్టి నీరు పెడితే రెండు నెలలకు పుదీనా కోతకొస్తోంది. ఆపై మళ్లీ డ్రిప్ ద్వారా నీరు పెట్టుకుంటూ కలుపు తీసి పోషణ చేసుకుంటే 45 రోజుల్లో రెండో కోత వస్తుందని చెబుతున్నారు. ఆపై మళ్లీ నీటి సరఫరాతో ఇంకో 45 రోజులకు.. ఇలా 20 కోతల వరకూ పుదీనా తీసుకోవచ్చని రైతులు చెబుతున్నారు.

ప్రతీనెల ఆదాయం..

ఓ రైతు నాలుగున్నర ఎకరాల్లో పుదీనా సాగు చేస్తే ఎకరానికి రూ.లక్ష చొప్పున పెట్టుబడి అవసరమవుతుంది. ఆపై అన్ని ఖర్చులు పోను నెలకు రూ.50 వేల లాభం వస్తుందని చెబుతున్నారు. చీడపీడలు తక్కువ కావడం.. వైరా మార్కెట్‌లో హోల్‌సేల్ వ్యాపారులు కట్ట రూ.6కు తీసుకుంటుండడం.. తరచుగా ఖమ్మం, కొత్తగూడెంలోనూ అమ్ముతుండడంతో రైతులకు నికర లాభం వస్తోందని చెబుతున్నారు. దీనికి తోడు ఎకరానికి పది మంది కూలీలు పుదీనా కోసి కట్టలు కట్టాల్సి ఉంటుంది. దీంతో ఒక రైతు సాగు చేసే తోటలోనే 30 మంది వరకు కూలీలు అవసరం అవుతుండడంతో స్థానికంగా కూలీలకు నిత్యం రూ.400 చొప్పున అందుతున్నాయి.

ఒకసారి అంటుకడితే 20 సార్లు..



ప్రతీనెల పుదీనా సాగుతో ఖర్చులు పోగా రూ.50వేల వరకు మిగులుతున్నాయి. నిత్య పరిశీలనకు తోడు ఓసారి అంటు కట్టి నీరు పెడుతుంటే 20 సార్లయినా పుదీనా తీసుకోవచ్చు. చీడపీడలు తక్కువే కాగా, కలుపు పెరగకుండా చూసుకుంటే చాలు.

– గాదె నరసింహారావు, రైతు, మంగాపురం

అందరికీ అందుబాటులో...



మా గ్రామ రైతులు పుదీనా సాగు చేస్తుండడంతో ఎప్పుడు కావాలన్నా తాజాగా లభిస్తోంది. వివాహాది శుభకార్యాల సమయాన ఇబ్బంది ఉండడం లేదు. మార్కెట్‌కు వెళ్లే పని లేకుండానే ఫోన్‌లో చెబితే చాలు నేరుగా ఇంటికే తెచ్చి ఇస్తున్నారు.

– పరుచూరి సతీష్, మంగాపురం

క్లుప్తంగా

మరొకరి పార్సిల్ తీసుకెళ్లిన వ్యక్తిపై కేసు

చింతకాని: ఓ వ్యక్తికి వచ్చిన రిజిస్టర్ పార్సిల్‌ను మరో వ్యక్తి తీసుకెళ్లగా పోలీసులు కేసు నమోదు చేశారు. చింతకాని మండలం మత్కేపల్లి గ్రామ బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ గడ్డం బాలాజీ అనంతసాగర్ గ్రామానికి జనవరి నుంచి ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. గతనెల 12వ తేదీన అనంతసాగర్‌కు చెందిన వడ్లమూడి సత్యనారాయణ పేరిట రిజిస్టర్ పోస్ట్ రాగా వడ్లమూడి నాగేశ్వరరావు తానే సత్యనారాయణ అని చెప్పి తీసుకెళ్లాడు. ఆతర్వాత సత్యనారాయణ భార్య సుభద్ర ఆరాతీయగా అప్పటికే తీసుకెళ్లినట్లు చెప్పడంతో సంతకం, ఫోన్ నంబర్‌ను ఆదారంగా వడ్లమూడి నాగేశ్వరరావుగా గుర్తించారు. ఈమేరకు బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ ఇచ్చిన ఫిర్యాదుతో బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.


రీజియన్‌ను అగ్రగామిగా నిలిపారు...



డిప్యూటీ ఆర్ఎంలను సత్కరించిన ఆర్ఎం, ఉద్యోగులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంలో విధులు నిర్వర్తించిన ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్ (ఆపరేషన్స్) జీ.ఎస్.పవిత్ర, డిప్యూటీ రీజినల్ మేనేజర్(మెకానికల్) ఎస్.భవానీప్రసాద్‌ను రీజియన్‌ను అగ్రగామిగా నిలిపారని రీజినల్ మేనేజర్ ఏ.సరిరాం కొనియాడారు. బదిలీపై వెళ్తున్న పవిత్ర, భవానీప్రసాద్‌ను ఖమ్మం ఆర్ఎం కార్యాలయంలో బుధవారం సన్మానించారు. ఈసందర్భంగా సరిరాం మాట్లాడుతూ వారి సేవలను కొనియాడారు. అనంతరం షాద్‌నగర్, మహబూబ్‌నగర్ రీజియన్లకు పవిత్ర, భవానీప్రసాద్‌ను ఖమ్మం, మధిర, సత్తుపల్లి, కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు డిపోల మేనేజర్లు, వివిధ విభాగాల ఉద్యోగులు సన్మానించారు.

జీవిత అనుభవాల్ని తెలిపేదే కథ..



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న రవీందర్

ఖమ్మం సహకారనగర్: కథ అంటే జీవిత అనుభవాల్ని తెలపడమే కాక సందేశాన్ని ఇస్తుందని కవి, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత డాక్టర్ పసునూరి రవీందర్ తెలిపారు. ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో కళాశాల తెలుగు విభాగం, ఐక్యూఏసీ విభాగాల ఆధ్వర్యాన బుధవారం 'కథలోకి..' పేరిట నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. కథలు రాసే విధానంపై తన అనుభవాలను వివరించగా, ప్రముఖ కథా రచయిత నల్లగొండ నాగార్జున ప్రభుత్వ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వెల్దండి శ్రీధర్ తదితరులు మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ పి.రవికుమార్, ఎం.సునంద, డాక్టర్ సీతారాం తో పాటు ప్రసేన్, రవిమారుత్, ఏ.ఎల్.ఎస్.శాస్త్రి, డాక్టర్ బానోత్ రెడ్డి, డాక్టర్ జె.అనురాధ, డాక్టర్ కిరణ్, కోటమ్మ, ఎం.వీ.రమణ, కార్తీక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



రైల్వే ట్రాక్‌పై ట్రక్

రైలు చక్రాలకు అనుగుణంగానే పట్టాలు ఉంటాయి. తద్వారా వీటిపై రైళ్లు మాత్రమే నడవడం వీలుతుంది. కానీ ఖమ్మంలోని మధ్యగేట్ వద్ద ఓ ట్రక్ ట్రాక్‌పై పరుగులు తీయడం కనిపించింది. ఇదేమిటని ఆరా తీస్తే మూడో లైన్ నిర్మాణ పనులకు కంకర, ఇతర సామగ్రి చేరవేసేందుకు ట్రక్‌కు ఉన్న టైర్లు తొలగించి రైళ్లకు ఉండే చక్రాలను బిగించినట్లు కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు చెప్పారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం

కొత్త టెండర్.. పాత అంబులెన్స్‌లు !

మణుగూరు టౌన్: సింగరేణి మణుగూరు ఏరియా ఆస్పత్రిలో నూతన అంబులెన్స్‌ల ఏర్పాటుకు టెండర్ ఖరారైనా కాంట్రాక్టర్ పాత అంబులెన్స్‌లతోనే కాలం వెళ్లదీస్తున్నాడు. అధికారుల సహకారంతోనే ఇలా వ్యవహరిస్తున్నాడనే విమర్శలు వస్తున్నాయి. గతంలో అంబులెన్స్‌ల్లో ఏసీ లేకున్నా బిల్లులు మంజూరు చేయడం ఈ విమర్శలకు బలం చేకూరుస్తోంది. పాత అంబులెన్స్‌ల టెండర్ గత నవంబర్ రెండో వారంలో ముగియగా, నూతన అంబులెన్స్‌ల టెండరూ ఆ కాంట్రాక్టర్‌కే దక్కింది. దీంతో మూడు కొత్త అంబులెన్స్‌లు సమకూర్చుకునేందుకు 40 రోజుల గడువు కోరగా నాలుగు నెలలైనా మార్చలేదు. ఈ విషయమై ఆస్పత్రి డీవైసీఎంఓ మేరీకుమారిని వివరణ కోరగా... అత్యవసర సర్వీసు కావడంతో పాత వాహనాలకు 40 రోజులు గడువు ఇచ్చామన్నారు. దరఖాస్తు చేసుకోకుండా, పాత అంబులెన్స్‌లు నడిపిన నేపథ్యాన ఫిబ్రవరి, మార్చి నెలల బిల్లులు మంజూరవుతాయో, లేదోనని చెప్పడం గమనార్హం.

ఎండల వేళ.. మామిడి జాగ్రత్త

- బిందు సేద్యంతో తోటలకు నీరు అందిస్తే మేలు
- ఖమ్మం జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి మధుసూదన్



మామిడి రైతులకు సూచనలు చేస్తున్న ఉద్యాన అధికారులు

ఖమ్మంవ్యవసాయం: రోజురోజుకు ఎండ తీవ్రత పెరుగుతోంది. అధిక ఉష్ణోగ్రతల నేపథ్యాన మామిడి తోటల రక్షణపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరముంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో దాదాపు 40 వేల ఎకరాల్లో మామిడి సాగవుతుండగా, ఖమ్మం జిల్లాలో 30 వేలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 10వేల ఎకరాల్లో తోటలు ఉన్నాయి. ప్రస్తుతం మామిడి కాయ దశలో ఉండడం.. ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున పంటను రక్షించుకుంటూ నాణ్యమైన దిగుబడులను సాధించేందుకు రైతులు తగిన యాజమాన్య పద్ధతులు పాటించాలని ఖమ్మం జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి ఎం.వీ.మధుసూదన్ సూచించారు. ఈమేరకు జిలాల్లోని పలు ప్రాంతాల్లో తోటలను పరిశీలించిన రైతులకు ఆయన చేసిన సూచనలు ఇలా ఉన్నాయి.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- ప్రతీ మొక్కకు 6 – 8 డ్రిప్పర్లతో రోజుకు మూడు గంటలు చొప్పున బిందు సేద్యం ద్వారా నీరు అందించాలి.
- ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున నేలలో తేమ సమతుల్యతను కాపాడేందుకు ఉదయం గంటన్నర, సాయంత్రం గంటన్నర నీరు పెట్టాలి.
- డ్రిప్పర్లు చెట్టు కాండం నుండి 1.5 మీటర్ల దూరంలో ఉండాలి. డ్రిప్పర్ స్థానాన్ని క్రమం తప్పకుండా తనిఖీ చేయాలి.
- కాయ సైజు వేగంగా పెరిగేందుకు పదేళ్ల కంటే ఎక్కువ వయస్సు కలిగిన చెట్లకు 500 గ్రాముల యూరియా, 500 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేయాలి.
- త్రిప్స్(రసం పీల్చే చీడపీడలు) కనిపిస్తే లీటర్ నీటికి ఫిప్రోనిల్ 2 మి.లీ. కలిపి పిచికారీ చేయాలి.
- వాతావరణ మార్పు ప్రభావాలను తగ్గించడానికి మామిడి తోటకు ప్రతిరోజూ క్రమం తప్పకుండా నీరు పట్టడమే ప్రధానం.
- సాధారణంగా మామిడి తోటల వ్యాపారులు తక్కువ నీరు పెడుతుంటారు. లేదా రోజు విడిచి రోజు నీరు ఇస్తారు. తద్వారా పండ్లు రాలిపోయే ప్రమాదమున్నందున జాగ్రత్తలు వహించాలి.

పక్షుల కోసం ప్రత్యేకం !

ఖమ్మంలోని పార్క్‌ల్లో నీటి పాత్రలు

ఖమ్మంలో పర్యావరణ పరిరక్షణ, మూగజీవాల సంరక్షణకు నగర పాలకసంస్థ అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే పార్కుల్లో వేలాదిగా మొక్కలు నాటగా.. పక్షులు సేద తీరుతున్నాయి. ఈ వేసవిలో పక్షులకు నీరు అందించేందుకు మొక్కలు, చెట్లకు పాత్రలు ఏర్పాటు చేస్తున్నారు. అన్ని పార్క్‌లు, వాకింగ్ ట్రాక్‌ల వద్ద ఉన్న చెట్లకు వీటిని బిగించి ప్రతిరోజు పాత్రలో నీరు పోయనున్నట్లు అధికారులు తెలిపారు.– ఖమ్మంమయూరిసెంటర్



మొక్కకు ఏర్పాటుచేసిన పాత్రలో నీరు పోస్తున్న సిబ్బంది



గోళ్లపాడు చానల్‌పై చెట్లకు పాత్రలు ఏర్పాటు చేస్తున్న కార్మికులు

సింగరేణి కార్మికులకు ఇన్సెంటివ్

- నెలలో 22 మస్టర్లు పనిచేసిన వారికే వర్తింపు
- ఫిబ్రవరి ఇన్సెంటివ్ నేడు చెల్లింపు



సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ ఈ ఏడాది నిర్దేశించుకున్న వార్షిక లక్ష్యం 72 మిలియన్ టన్నులు సాధించడానికి గాను జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో ప్రతీ గనికి (ఓపెన్‌కాస్ట్, భూగర్భ) డిపార్ట్‌మెంట్ (సీహెచ్‌పీ)లకు కొంత టార్గెట్ నిర్ణయించింది. లక్ష్యాన్ని సాధించేందుకు గాను ఈ విభాగాల్లో పనిచేసే ఉద్యోగులు ఈ మూడు మాసాల్లో నెలకు కనీసం 22 మస్టర్లు పనిచేయాలని, అలా చేసిన వారికి మాత్రమే ఇన్సెంటివ్ ఇస్తామని ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి నెలకు సంబంధించిన ఇన్సెంటివ్‌ను గురువారం ఆయా కార్మికులకు చెల్లించనుంది.

లక్ష్యాలు ఇలా..

ఆర్జీ–1లోని జీడీకే–11 ఇంక్లైయిన్ గనిలో 58,800 టన్నుల లక్ష్యానికి గాను 75,301 టన్నులు సాధించగా ఆ గనిలో పనిచేసే ఉద్యోగులకు రూ.2,500 స్పెషల్ ఇన్సెంటివ్ ఇవ్వనుంది. మణుగూరులోని ఓసీ–2లో 1,68,000 టన్నుల లక్ష్యానికి 2,08,580 టన్నులు సాధించగా ఆయా ఉద్యోగులు రూ. 2,200 చొప్పున, ఇల్లెందులో 1,96,000 టన్నుల లక్ష్యానికి 2,29,617 టన్నులు సాధించారు. ఆ గని ఉద్యోగులు రూ. 2,200 చొప్పున నేడు ఇన్సెంటివ్ అందుకోనున్నారు. అయితే గ్రేడ్‌ల ఆధారంగా ఈ ఇన్సెంటివ్ చెల్లిస్తున్నట్లు యాజమాన్యం తెలిపింది.

మిగతా ఏరియాల్లో ఇలా..

- కొత్తగూడెం ఏరియాలోని జేవీఆర్‌ఓసీ–2లో 9,52,000 టన్నుల లక్ష్యానికి 10,13,430 టన్నులు (106 శాతం)సాధించగా, ఈ ఓసీలో పనిచేసే ఉద్యోగులు రూ.2,200 ఇన్సెంటివ్ అందుకోనున్నారు.
- భూపాలపల్లి ఏరియా కేటీకే 8 ఇంక్లైయిన్‌లో 16,800 టన్నుల లక్ష్యానికి 17,043 టన్నులు సాధించగా వీరికి రూ.1,200 ఇన్సెంటివ్ రానుంది.
- భూపాలపెల్లి కేటీకే ఓసీ–2లో 1,40,000 టన్నుల లక్ష్యానికి 1,52,665 టన్నులు సాధించగా ఇక్కడి ఉద్యోగులకు రూ.1,700 ఇన్సెంటివ్ చెల్లించనుంది.
- మందమర్రి ఏరియాలోని కేకే5 గనిలో 16,800 టన్నుల లక్ష్యానికి 16,802 టన్నులు సాధించగా వీరికి రూ.1,200 ఇన్సెంటివ్ రానుంది.
- మందమర్రి ఏరియాలోని కేకే ఓసీలో 1,12,000 టన్నుల లక్ష్యానికి 1,31,173 టన్నులు సాధించగా, ఇందులో పనిచేసే కార్మికులకు రూ.1,200 ఇన్సెంటివ్ చెల్లించనుంది.
- శ్రీరాంపూర్‌లోని ఆర్కే–5 గనిలో 21,000 టన్నుల లక్ష్యానికి 21,478 టన్నులు సాధించగా ఇక్కడి ఉద్యోగులకు రూ.1,500 చొప్పున, అదే ఏరియాలోని ఆర్కే–6 ఇంక్లైయిన్‌లో 14,840 టన్నులకు 15,683 టన్నుల ఉత్పత్తి సాధించగా వీరికి రూ.1,700 చొప్పున ఇన్సెంటివ్ చెల్లించనుంది. రామకృష్ణాపూర్‌లోని రాంటెంకి గనిలో 14 వేల టన్నుల లక్ష్యానికి 14,694 టన్నులు సాధించగా అక్కడి ఉద్యోగులు రూ.1,200 చొప్పుప ఇన్సెంటివ్ అందుకోనున్నారు.